క్లుప్తంగా

అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం నేడు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్ట లక్ష్మి దేవాలయం 12వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ మూర్తి, రమాదేవి దంపతులు తెలిపారు. వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయను పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు సర్వ దర్శనాలు, 8 గంటల నుంచి విశ్వక్సేన పూజలు, 11.30కి శ్రీ లక్ష్మీనారాయణ హోమం, సాయంత్రం విశేష సేవలు, శేష వాహనం, గరుడ వాహనం, పల్లకీ సేవ, తిరువీధి ఉత్సవం, అనంతరం శ్రీ లక్ష్మీనారాయణులకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆహ్వానం

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న శెట్టి రమేష్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆసక్తి కలిగిన జట్లకు నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. గెలుపొందిన మొదటి మూడు జట్లకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 24 వరకు 90148 45760, 86883 54624 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలసకు చెందిన శీరం గోపి (37) గురువారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని తల్లి లక్ష్మి భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెయింటింగ్ పనులకు వెళ్లే గోపికి భార్యతో మనస్పర్థలు కారణంగా విడాకులు తీసుకున్నాడు. అలాగే తండ్రి అప్పలరాజు అనారోగ్యంతో బాధపడుతుండడంతో గోపి తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసై గురువారం సాయంత్రం విధుల నుంచి ఇంటికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పీఎం పాలెం: స్థానిక తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. బాటసారులకు రుచికరమైన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు గాదె రోశిరెడ్డి, అధ్యక్షుడు బ్రహ్మాజీ, సెక్రటరీ ఎ.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు సి.విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, కోశాధికారి ఐజాక్, దాసరి శ్రీను, పోతిన సూరిబాబు, అబ్బులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమకు విశాఖ అనుకూలం


మాట్లాడుతున్న ఆచార్య ప్రసాదరావు

సీతంపేట: చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి విశాఖ అనువైనదని ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆస్కార్ బెస్ట్ ఫిల్మ్, 7 అవార్డులు పొందిన ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రాన్ని ప్రదర్శించారు. ముందుగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు కూడా అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'ది వేల్' చిత్రాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో బి. చిన్నారావు, అనూరాధ, హరనాథ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు


మొక్క నాటుతున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు


రుషికొండ బీచ్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి తదితరులు

కొమ్మాది: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో పలు కళాశాలల విద్యార్థులతో కలిసి వ్యర్థాలు తొలగించే కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. బావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పర్యావరణానికి పెనుముప్పుగా మారిన పాలిథిన్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో ధరిత్రీ దినోత్సవం

కొమ్మాది: ప్రపంచ ధరిత్రీ దినోత్సవం (వరల్డ్ ఎర్త్ డే)ను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు భూ గ్రహాన్ని మరింతగా వేడెక్కిస్తున్నాయని, దీంతో పర్యావరణంలో పెను మార్పులు చోటుచేసుకుని జీవరాశుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్తూ గీతం ప్రాంగణంలో పలు మొక్కలు నాటారు.

భూమిని పరిరక్షించుకోవాలని ర్యాలీ

పద్మనాభం: ఎర్త్ డే లో భాగంగా పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యార్థినులు భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మన సంస్కృతి మనకు నేర్పింది పర్యావరణ పరిరక్షణే అని, భూగోళాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు చేపట్టాలని, అందరూ చేతులు కలిపి మొక్కలు నాటాలని నినాదాలు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థినులు ఎర్త్ డే ఆకారంలో ఏర్పడి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా


శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రేపటి నుంచి గ్రామ దేవతల పండగ




ముత్యాలమ్మ వారు, పరదేశమ్మ వారు, లక్ష్మమ్మ వారు

మధురవాడ: మధురవాడలోని మల్లయ్యపాలెం, కొత్తపాలెం పరిసర గ్రామాల ముగ్గురమ్మల ఉత్సవాలు సోమవారం నుంచి 3 రోజులపాటు జరగనున్నాయి. ఆయా గ్రామాల ఆరాధ్య దేవతలు ముత్యాలమ్మ, పరదేశమ్మ, లక్ష్మమ్మ అమ్మవార్ల పండగ మహోత్సవాల నిర్వహణకు గ్రామాలు ముస్తాబయ్యాయి. ఈ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ప్రారంభం కానున్నాయి. మంగళవారం అనుపు, బుధవారం ముగింపు ఉత్సవాలు జరుపుతామని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కుండపోత వర్షంతో ఉపశమనం


సబ్బవానిపేట వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


కృష్ణాపురంలో వర్షానికి తడిసిన మొక్కజొన్నలు

తగరపువలస: భీమిలి పరిధిలో శనివారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి సర్వీస్‌రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. రహదారులపై మురుగు ముంచెత్తింది. ఇటీవల ఈ ప్రాంతంలో ఎండలు తీవ్రంగా మండిపోతుండడంతోపాటు వడగాల్పులు వీస్తుండడంతో ఉక్కబోతకు గురై ప్రజలు అల్లాడిపోతుండేవారు. శనివారం పగటివేళ కాస్త ఎండ తగ్గడంతోపాటు సాయంత్రం కురిసిన వర్షానికి పలువురు ఉపశమనం పొందారు.

పీఎం పాలెం: శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురవడంతో ఎండల తాపం నుంచి పీఎం పాలెం వాసులు ఉపశమనం పొందారు. స్థానిక బస్టాపుల వద్ద ప్రయాణికులు, విద్యార్థులు చినుకులు పడుతున్నా లెక్కచేయకుండా చల్లదనాన్ని ఆస్వాదించారు.

వర్షానికి తడిసిన మొక్కజొన్నలు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఎండబెట్టిన మొక్క జొన్నలు తడిసిపోవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. మండలంలో రబీ సీజన్‌లో 1610 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. డిసెంబర్ నెలలో రైతులు ఈ పంట వేశారు. నాలుగు నెలల తర్వాత పంట పక్వానికి రావడంతో జొన్న వెన్నులు పొలంలో ఎండ బెట్టారు. వర్షం కురవడంతో మొక్కజొన్నలు తడిసి చెదపట్టే ప్రమాదం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం కూడా వర్షం కురిస్తే గింజలు రంగు మారే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోసిపోయిన వారపు సంత

మధురవాడ: మధురవాడలో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం 4 గంటల వరకు భగభగమండే ఎండ తొలగి మేఘాలు కమ్ముకోవడంతో పెద్ద వర్షమే కురుస్తుందని అంతా భావించారు. కానీ వరుణుడు చిరు జల్లులే కురిపించాడు. చిరుజల్లులతో వారపు సంత వెలవెలబోయింది. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'యూనియన్ బ్యాంకు సేవల్లో లోపాలు'

తగరపువలస: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్థానిక బ్రాంచిలో సేవలకు సంబంధించి లోపాలను సిబ్బంది సరిచేసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఇటీవల బ్రాంచిలో ఖాతా వివరాలు తెలుసుకోవడానికి సంప్రదిస్తే ప్రింటర్లు పనిచేయడం లేదని సిబ్బంది తిప్పుతున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలు బ్యాంకు ఖాతాల్లో నమోదవుతున్నందున పాస్ పుస్తకాలు ప్రింట్ చేసి తీసుకుని రావాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు అడుగుతున్నారన్నారు. మూడు మాసాలుగా బ్రాంచ్‌లో తమ ఖాతాల వివరాలు పాస్ పుస్తకాల్లో అప్‌డేట్ చేసి ఇవ్వాలని కోరుతున్నా సిబ్బంది స్పందించడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు.

భక్తితో రంజాన్ ప్రార్థనలు


రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

భీమునిపట్నం: భీమిలిలో శనివారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జామియా మసీద్ గురువు మహ్మద్ నసీర్ అక్తర్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలో పాల్గొన్నారు. మసీద్ పెద్దలు షేక్ అబ్దుల్ నయిం (అంజు), షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ మతీన్ పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ తొలగించి.. సుందరంగా మార్చి..


రామన్నపేట వద్ద శుక్రవారం కనిపించిన డస్ట్‌బిన్


డస్ట్‌బిన్ తొలగించి శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు

తగరపువలస: జీవీఎంసీ శానిటరీ సిబ్బంది రామన్నపేట సమీపంలో డస్ట్‌బిన్ తొలగించి సుందరంగా తీర్చిదిద్దారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం స్థానిక బైపాస్‌రోడ్డులో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన డస్ట్‌బిన్‌లు ఉండటం గమనించారు. ఇంటింటా చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు వస్తుండగా ఇంకా డస్ట్‌బిన్‌లు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై డస్ట్‌బిన్‌లు ఉంచడం, చెత్త వేయడం చేయరాదని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. దీంతో శనివారం డస్ట్‌బిన్ తీసేసిన పారిశుధ్య సిబ్బంది అక్కడ శుభ్రం చేసి ముగ్గులు పెట్టి పూలమొక్కలతో అందంగా అలంకరించారు. అంతేకాకుండా ఇచ్చట చెత్త వేయరాదంటూ స్లోగన్ రాసి ఉంచారు. దీంతో నిత్యం చెత్తమయంగా ఉండే ఈ ప్రదేశం ఇప్పుడు అందంగా కనిపిస్తుంది.

పద్మశాలీ సేవా సంఘంలో విభేదాలు


మాట్లాడుతున్న మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్

తగరపువలస: స్థానిక పద్మశాలీ సేవా సంఘంలో ఇటీవల విభేదాలు పొడ చూపాయి. తగరపువలస గ్రామదేవత ఎల్లారమ్మకు పసుపు – కుంకుమ ఇచ్చే నిమిత్తం ఇటీవల జరిగిన సమావేశంలో కొప్పల కృష్ణ అనే వ్యక్తి సంతబయలు వద్ద పాలధార పుట్టలో హుండీలోని డబ్బులు కాజేశారని గిడుతూరి శ్రీనివాసరావు ఆరోపించాడు. దీనిపై ప్రతినిధులు గిడుతూరి శ్రీనివాసరావును సంఘ కార్యాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. హుండీ నిండిపోయినందున ఏడాది క్రితం నలుగురు వ్యక్తులు అందులో డబ్బులు తీసి సంఘ పెద్దలకు అప్పగించారన్నారు. వారిలో గిడుతూరి శ్రీనివాసరావు కూడా ఉన్నాడన్నారు. అయితే వారి మాటలతో శ్రీనివాసరావు ఏకీభవించకపోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో శనివారం గిడుతూరి శ్రీనివాసరావు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్వీ రమణ, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రావాడ నాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పిట్టా సురేష్, కొందరు పద్మశాలీ సంఘం ప్రతినిధులు, టీడీపీ నాయకులతో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు కొప్పల రమేష్ తనను కొట్టి అవమానించారని, సంఘం నుంచి బహిష్కరించారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరాడు. మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉందని కులం, మతం పేరుతో ఎవరికి నష్టం కలిగినా అండగా ఉంటామన్నారు. దీనిపై సంఘం అధ్యక్షుడు కొప్పల రమేష్‌ను వివరణ కోరగా గిడుతూరి శ్రీనివాసరావు తరచూ కుల సంఘ పెద్దలను, కార్యకలాపాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీకి చెందిన ఆయన సామాజిక మాధ్యమాలలో తరచూ వైఎస్సార్‌సీపీపై కూడా బురద చల్లుతున్నారన్నారు. సంఘంపై గౌరవం లేని ఇలాంటి వివాదాస్పదమైన వ్యక్తి సభ్యునిగా పనికిరాడనే తాత్కాలికంగా తొలగించామన్నారు. కుల బహిష్కరణ, కొట్టడం నిజం కాదన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు భరోసా


గణేష్‌నగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వంగపండు ఉష


వలందపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు

రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష

మధురవాడ: బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు భరోసా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష అన్నారు. 13 జిల్లాల పర్యటనలో భాగంగా ఆమె శనివారం మధురవాడ విచ్చేసి గణేష్‌నగర్‌లో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకాలన్నీ ప్రతీ గడపకు చేరేలా చర్యలు చేపట్టి ప్రతి మహిళనూ లక్షాధికారిగా తీర్చిదిద్దడమే జగనన్న లక్ష్యమన్నారు. పురుషులతో సమానంగా పదవులు ఇచ్చి మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేసిన నాయకుడని కొనియాడారు. కరోనా విపత్కర కాలంలో కూడా వలంటీర్లు ద్వారా ప్రజలకు అండగా నిలిచారన్నారు. జగనన్నే మా నమ్మకం అంటూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల సాంస్కృతిక విభాగం కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, శ్రీకాకుళం, అల్లూరి మన్యం జిల్లాల కో ఆర్డినేటర్ కొరగంజి ధర్మారావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, నాయకులు బంగారు ప్రకాశ్, తమ్మినేని వరలక్ష్మి, పసుపులేటి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలి

తగరపువలస: వివక్షకు తావు లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2024లో కూడా ముఖ్యమంత్రి కావాలని జీవీఎంసీ 2వ వార్డు వలందపేట ప్రజలు కోరారు. శనివారం జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు సర్వే చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొనసన శ్రీనివాసరెడ్డి, చిల్ల సూరిదాసు, శీరపు నరసింగరావు, కళింగపట్నం రాంబాబు, మొక్క శ్రీను, సరగడ శ్రీను, కంబపు దుర్గారెడ్డి, చిల్ల గోపాలరెడ్డి, నగిరెడ్ల రాంబాబు, ఎరుసు అప్పలకొండ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

25న ఆదిశంకరాచార్యుల జయంతి


ఆదిశంకరాచార్యుల ప్రతిమ

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఈ నెల 25న జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు మఠం గౌరవ పరిపాలన అధికారి జగర్లపూడి వేంకటేశ్వర్లు తెలిపారు. ఆ రోజు శంకరాచార్యుల పాదుకలకు విశేష పూజలు జరుపుతామని తెలిపారు.

1 నుంచి ఉచిత శిక్షణ

తగరపువలస: ఏబీవీపీ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు పరిషత్ రాష్ట్ర విద్యార్థి విభాగం కన్వీనర్ లొడగల అచ్చిబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు విడుదల చేశారు. చిట్టివలస బొగ్గు రోడ్డు వద్ద శ్రీకృష్ణా జూనియర్, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 26లోగా దరఖాస్తు చేయాలని కోరారు. వివరాలకు 99081 16816, 73869 96808లో సంప్రదించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్యోత్స్న, హర్షిత ప్రతిభ

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ అంతర జిల్లాల మెన్, వుమెన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్న, హర్షిత మొత్తంగా 300+కేజీల బరువును ఎత్తి సత్తా చాటారు. రెండు రోజుల పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్‌తో పాటు మాస్టర్స్‌కు ఈ పోటీలు స్క్వాట్, బెంచ్‌ప్రెస్‌తో పాటు డెడ్‌లిఫ్ట్ అంశాల్లోనూ జరగనున్నాయి. ఏయూ ఇండోర్ జిమ్నాజియంలో తొలిరోజు సబ్ జూనియర్ బాలికల 43 కేజీల వెయిట్ కాటగిరీలో ఎం.షనూన్ స్క్వాట్‌లో 75 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 27.5కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 90 కేజీలతో మొత్తంగా 192.5కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. బి.దీక్షిత, సీహెచ్ దౌలశ్రీ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 52 కేజీల విభాగంలో ఎ.జ్యోత్స్న స్క్వాట్‌లో 140 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 135 కేజీలతో మొత్తంగా 345 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎ.ప్రవల్లిక, కె.ఆశ్రిత వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 57 కేజీల వెయిట్‌లో ఎస్.కృష్ణవేణి స్క్వాట్‌లో 80 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 42.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 100 కేజీలతో మొత్తంగా 222.5 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఆర్.వందన, ఎం.జనని వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. 63 కేజీల వెయిట్‌లో హర్షిత తివారి స్క్వాట్‌లో 125 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 60 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 140 కేజీలతో మొత్తంగా 325 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఎస్.లక్ష్మి, ఎం.పూర్ణిమ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 69 కేజీల వెయిట్‌లో జి.సుభాషిణి స్క్వాట్‌లో 120 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 45 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 125 కేజీలతో మొత్తంగా 290 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎన్.షైనీ, పి.భానుశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

నేల తల్లిని స్మరించే గొప్ప సంస్కృతి మనది

ధరిత్రీ దినోత్సవంలో చినజీయర్ స్వామి అనుగ్రహ భాషణం



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

ఏయూ క్యాంపస్: పుడమి పరిరక్షణలో ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తెరిగి నడుచుకోవాలని చినజీయర్ స్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికాస తరంగిణి నిర్వహించిన మన భూమి – మన బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. విశ్వంలో సమస్త ప్రాణికోటితో మానవ జీవనం ముడిపడి ఉందనే విషయం విస్మరించరాదని సూచించారు. నిత్యం ఉదయం నిద్రలేస్తూనే నేలతల్లిని నమస్కరించి, స్మరించే గొప్ప సంస్కృతి మన సొంతమన్నారు. మనమంతా నేలతల్లి ఒడిలో ఆటలాడే పిల్లలమన్నారు. ధరిత్రీ పరిరక్షణకై మనలో మనం ఆలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నేలను తల్లిగా భావించడం వేదకాలం నుంచి ఉందన్నారు. విశ్వంలో మన స్థానం ఏంటని ఒకసారి మానవులు ప్రశ్నించుకోవాలన్నారు. గాలి, నీరు, ప్రాణికోటి బాగుంటేనే మనం బాగుంటామనే విషయం మరువకూడదన్నారు.

అహోబిల జీయర్ స్వామి మాట్లాడుతూ యువశక్తి సమాజ హితాన్ని కాంక్షించాలన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించడం అలవరచుకోవాలని సూచించారు. మంచి భావన వల్ల మంచి ఫలితం కలుగుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాణిని సంరక్షిస్తూ ధరిత్రిని కాపాడాలని పిలుపునిచ్చారు. పుడమి కేవలం మనుషులదే అనుకోవడం సరికాదన్నారు. ఏయూ నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో జీయర్ స్వామి నిర్వహించే కార్యక్రమాలు అనుసంధానం చేయాలని కోరారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని విస్మరిస్తే ముప్పు తప్పదనే విషయాన్ని కథారూపంలో విద్యార్థులకు వివరించారు. వికాస తరంగిణి సభ్యులు టి.టి.వి.రమణ మూర్తి, సాతులూరి రామానుజం, పి.పద్మనాభ రావు, నారాయణ రెడ్డి, అడుసుమిల్లి రాము తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను, ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.